జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 23-07-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 80 పేజీలు: 8 వెల : రూ.7


## ఎస్పీ సాబ్.. ట్రాఫిక్‌పై..
# ఓ కన్నేయ్యండి











*** నగరంలో పలు ప్రధాన రహదారుల ఆక్రమణ * రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలుపుదల * నిబంధనలకు విరుద్ధంగా ప్రచార బోర్డులు * ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద అమలుకాని రూల్స్ * రెగ్యులర్ ట్రాఫిక్ డీఎస్పీ లేకపోవడమే కారణం * సెల్‌ఫోన్‌కే పోలీసులు పరిమితం * ఆటో డ్రైవర్లపైనే జులుం * ప్రైవేట్ బస్సుల యజమానులపై మమకారం * పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో అమలుకాని పోలీసు నిబంధనలు * ఎక్కడికక్కడ పార్కింగ్‌తో నిత్యం ట్రాఫిక్ జాం * కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న ట్రాఫిక్ పోలీసుల వైఫల్యం * శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్న నగరవాసులు**

**శ్రీకాకుళం క్రైం, జులై 22 (వార్త):** శ్రీకాకుళం నగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. జనాభా పెరిగింది. అందుకనుగుణంగా రోడ్లు విస్తరించలేదు. ప్రధాన రహదారులు మినహా మిగతా వన్ని సందులే. ప్రతి ఒక్కరి వద్ద బైక్‌లు, కార్లు ఉన్నాయి. కొత్తగా భవన నిర్మాణాలు చేపడుతున్న వారు సైతం సెల్లార్లు విడిచిపెట్టడం లేదు. దీంతో ప్రధాన రహదారుల్లోని ఫుట్‌పాత్‌ను కొందరు వ్యాపారులు ఆక్రమించేశారు. వాటిపై కొందరు షాపులు పెట్టుకోగా, మరికొందరు ప్రచార బోర్డులను ఏర్పాటుచేశారు. దీంతో పాదచారులు రోడ్డుపై నుంచి వెళుతున్నారు. ఇక బైక్‌లు, కార్లు కూడా రోడ్డుపైనే అడ్డదిడ్డంగా పెడుతున్నారు. దీనివల్ల నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. జిల్లా పోలీసు కార్యాలయానికి ఆనుకుని ఉన్న అంబేడ్కర్ జంక్షన్ నుంచి ఆర్ట్స్ కళాశాలకు వెళ్లే రహదారి ఆక్రమణకు గురైంది. ఓ వైపు పండ్ల దుకాణాలు, మరోవైపు హొటళ్లు, ఆసుపత్రులు ఆక్రమించేశాయి. అలాగే రైతుబజార్ నుంచి జీటీ రోడ్డుకు వెళ్లే రహదారిది ఇదే పరిస్థితి. సాయంత్రం ఈ రోడ్డులో ప్రయాణమంటే వాహనచోదకులు హడలిపోతున్నారు. ఇక బలగ ఆసుపత్రి నుంచి ఆర్టీస కాంప్లెక్స్ మధ్యలో ప్రైవేట్ బస్సులు రోడ్డుపైనే ఆపి ప్రయాణికులను ఎక్కించుకుని వెళుతున్నారు. సాయంత్రం ఈరోడ్డులో నిత్యం ట్రాఫిక్ జాం అవుతోంది. ఈ బస్సులను నగరంలోకి రానీయకుండా కొత్తరోడ్డుకు వద్దే హాల్టింగ్ ఇవ్వాలని, అప్పుడు కొంతమేర ట్రాఫిక్‌కు నియంత్రించవచ్చని నగరవాసులు పదేపదే పోలీసులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. నగరంలో డే అండ్ నైట్ జంక్షన్, రామలక్ష్మణ జంక్షన్, పాతబస్టాండ్, ఏడురోడ్ల జంక్షన్ వద్ద మాత్రమే ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నాయి. అక్కడ కూడా కొందరు వాహనచోదకులు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పట్టించుకోకుండా రయ్‌రయ్‌మని వెళుతున్నా పోలీసులు చూస్తునే ఉంటారు తప్ప పట్టించుకోరు. ట్రాఫిక్ డీఎస్పీ లేకపోవడంతో సీఐయే అంతా చూసుకుంటుంటారు.. అతను శక్తికి మించి పనిచేస్తున్నా.. ఆ శాఖలోని కొందరు పోలీసులే అతని




మాటను పట్టించుకోవడం లేదు. మరికొందరు పోలీసులు కేవలం ఆటో డ్రైవర్లపైనే తమ ప్రతాపం చూపిస్తుంటారు. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు.. సెల్‌ఫోన్లు పట్టుకుని జరిమానా విధించడం, ఫైన్లు కట్టించుకోవడంపైనే ఎక్కువగా అత్యుత్సాహం చూపిస్తుంటారన్న విమర్శలు ఉన్నాయి. ఇక పొట్టి శ్రీరాములు మార్కెట్లోకి ఉదయం పూట లారీలు, వ్యాన్లు అనుమతించకూడదన్న నిబంధనలు ఉన్నా వ్యాపారులు పట్టించుకోరు. మార్కెట్ రోడ్డుకు రెండు వైపులా తోపుడుబళ్ల వ్యాపారులు ఆక్రమించేశారు. దీనివల్ల మార్కెట్‌లోకి వెళ్లి రావాలంటే అష్టకష్టాలు పడాల్సిందే. ట్రాఫిక్ పోలీసులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడరు. పాతబస్టాండ్ సమీపంలో కొత్తగా ఓ మార్ట్ ఇటీవల ఏర్పాటైంది. మార్ట్ ఆవరణలో పార్కింగ్ ప్లేస్ ఉన్నా కొందరు ద్విచక్రవాహనదారులు రోడ్డుపైనే వాహనాలు ఆపుతున్నారు. దీనివల్ల పాతబస్టాండ్ నుంచి జడ్పీ, కలెక్టరేట్‌కు వెళ్లే దారి లో నిత్యం ట్రాఫిక్ జాం అవుతోంది. జీటీ రోడ్డు, పాతబస్టాండ్ రోడ్డు మధ్య వాహనాలకు పార్కింగ్ ఇచ్చినప్పటికీ, కొందరు షాపుల ఆవరణలో వాహనాలు నిలుపుదల చేస్తున్నారు. గతంలో ట్రాఫిక్ పోలీసులు బైక్‌లపై మైక్ పెట్టుకుని నగరంలోని ప్రధాన రహదారుల్లో వెళుతూ అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపిన వారిపై కొరడా విదిల్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శ్రీకాకుళం నగరంపై దృష్టి సారిస్తే తప్ప ట్రాఫిక్ కష్టాలు గట్టెక్కేలా కనిపించడం లేదు. ఏం చేస్తారే మరి. వేచిచూడాల్సిందే..!






జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## 108 వాహనం సేవలపై ఆరా

**హిరమండలం, జులై 22 (వార్త):** 108 అత్యవసర వాహనం సేవలపై ఆడిట్ డివిజనల్ అధికారి జి.జగన్ సోమవారం తనిఖీ చేశారు. రోగుల నుంచి ఫోన్ వచ్చిన వెంటనే వారికి అందుబాటులో ఉండి ప్రాథమిక చికిత్స అందించాలని, ఆ తర్వాత ఆసుపత్రులకు తరలించాలన్నారు. మరింత బాధ్యతగా డ్యూటీ చేయాలని, వెహికల్స్‌లో మందులు, పరికరాలు ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కె.ఆఫీస్, పైలట్ సిహెచ్ చిన్న ఉన్నారు.

### పైడిగాం ప్రాజెక్టు ఆధునీకరణకు..

# నిధులు మంజూరు చేయండి

**సోంపేట, జులై 22 (వార్త):** సీపీఎం ఆధ్వర్యంలో ఆపార్టీ ప్రతినిధుల బృందం సోమవారం పైడిగాం ప్రాజెక్ట్ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గోవిందరావు మాట్లాడుతూ పైడిగాం ప్రాజెక్టు ఆయకట్టు సుమారు 5వేల ఎకరాలు ఉంటుందని, ఈ ప్రాజెక్టు ఆధునికరణ చేస్తే మరో 7 వేల ఎకరాలకు నీరు అందించవచ్చన్నారు. టిడిపి, వైసిపి ప్రభుత్వాలు గత పది సంవత్సరాలలో నిధులు కేటాయించకపోవడంతో ప్రాజెక్టు శిధిలావస్థకు చేరుకున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పైడిగాం ప్రాజెక్టు చివరి గ్రామాలైన పలాసపురం, లక్కవరం, బూరగాం, జింకిభద్ర, బెంకిలి మొదలగు గ్రామాలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నీరు అందకపోవడంతో నాట్లు వేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. మహేంద్రతనయ నుండి వచ్చే నీటిలో ఒరిస్సా ప్రభుత్వంతో ఒప్పందం మేరకు 185 క్యూసెక్కుల నీరు రావాలని, 40 క్యూసెక్కుల నీరు కూడా ఉపయోగించుకోలేని పరిస్థితి ఉందని విమర్శించారు. ప్రాజెక్టు ఆధునీకరణ చేయకపోవడంతో నీరు వృధాగా సముద్రంలో కలిసిపోతుందన్నారు. పాలకుల నిర్లక్ష్యమే రైతులకు శాపంగా మారిందని విమర్శించారు. పైడిగాం ప్రాజెక్టు పరిధిలో మూడు మండలాల్లో 70 చెరువులకు నీరు ఇవ్వవలసి ఉందని, కాలువలు ఆధునీకరించకపోవడం వలన నీరు అందడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని పైడిగాం ప్రాజెక్టుకి నిధులు కేటాయించి ఆధునీకరణ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగమణి, మోహనరావు, సంగారు లక్ష్మీనారాయణ, జయరామ్, రామచంద్ర, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

* సీపీఎం నేతలు * ప్రాజెక్టును సందర్శించిన నేతలు



# రైతులకు కూటమి ప్రభుత్వం అండ

**గార, జులై 22 (వార్త):** తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి, నియోజకవర్గం తెలుగు మహిళ అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్ అన్నారు. నియోజకవర్గంలో ఎడతెరిపిలేని వర్షాల కారణంగా అంపోలు, కిష్టప్పపేటలో పంటపొలాలు నీటిముంపునకు గురైన నేపథ్యంలో స్వాతి శంకర్ ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల బృందం సోమవారం పర్యటించింది. రైతులు తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలను వివరించారు. ఈ సందర్భంగా స్వాతి శంకర్ మాట్లాడుతూ ఏ ఒక్క రైతు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ప్రభుత్వం అన్నివిధాలా రైతాంగానికి అండగా ఉంటుందని, శాస్త్రవేత్తల సూచనలు పాటించి నష్టాన్ని నివారించుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో స్వాతి శంకర్ వెంట వ్యవసాయ శాఖ ఏడీ, గార వ్యవసాయధికారి, ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం, రాగోలు వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.



# రైతు సంక్షేమమే.. కూటమి ప్రభుత్వ ధ్యేయం



**బూర్జ, జులై 22 (వార్త):** నీలాదేవిపురం గ్రామంలో టీడీపీ నేతల ఆధ్వర్యంలో రైతులకు సోమవారం ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతు ఎరువులు, విత్తనాల కోసం పడరాని పాట్లు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో రైతులకు న్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీనివాస్, లంక జగన్నాధ నాయుడు, కోడి గోవిందరావు, మజ్జి రమణమూర్తి, కోడి హరినాథ్, గునాన విస్సు, ఉర్లాపు తవిటినాయుడు, పిసిని నీలకంఠం, కర్రి సంజీవరావు, లంక గౌరీ నాయుడు, వంజరాపు దాలినాయుడు, వంజరాపు గోవిందరావు, కొయ్యాన చంద్ర రావు, వంజరాపు చిట్టిబాబు, కొయ్యాన దుర్గారావు, రైతులు పాల్గొన్నారు.

### వార్షిక గ్రామ సంఘం

# మహాజన సభలు పూర్తి చేయాలి

**మందస, జులై 22 (వార్త):** వీఓఏలు అందరూ వార్షిక గ్రామ సంఘం మహాజన సభలు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని సెర్ప్ ఏపిఎం గొడబ ప్రసాదరావు కోరారు. మందస మండల సమాఖ్య కార్యక్రమంలో ప్రసాదరావు ఆధ్వర్యంలో వీవోఏల రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ ఉమెన్ లెడ్ ఎంటర్ప్రెనుర్ మెంబర్స్ ప్రతీ ఒక్క వీవోఏ 10మంది చొప్పున పేర్లు ఐడెంటిఫై చేయాలన్నారు. అప్లికేషన్స్ బ్యాంకర్స్‌కి సబ్మిట్ చెయ్యాలని, వీవోఏలకు సూచించారు. షెడ్యూల్డ్ డేట్స్ ప్రకారం వీవో మీటింగ్స్, చిన్న సంఘాల సమావేశాలు పెట్టుకోవాలన్నారు. క్లస్టర్ స్థాయిలో సీసీలు క్రమం తప్పకుండా రివ్యూలు పెట్టుకోవాలని, క్లస్టర్ రివ్యూ రిజిస్టర్ లో ప్రాజెక్ట్ ప్రయారిటీ వర్క్స్ గూర్చి చర్చించుకోవాలని సీసీలకు ఆదేశించారు. లోకోస్ యాప్‌లో తక్కువగా ఉన్న వీవోఏలను రివ్యూ చేసి ప్రోగ్రెస్‌లోకి రావాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఏపీఎం ప్రసాదరావుతో పాటు సీసీలు శ్రీనివాస్, వీఓఏలు, ఎం.ఎస్. అధ్యక్షురాలు కాంతమ్మ, కోశాధికారి విజయశ్రీ, అకౌంటెంట్ కళ్యాణి పాల్గొన్నారు.





## అమర జవాన్లకు ఏఐవైఎఫ్ నివాళి

**నరసన్నపేట, జులై 22 (వార్త):** శ్రీకాకుళం జిల్లాకు చెందిన డొక్కరి రాజేష్, సనపల జగదీశ్వరరావులు ఉగ్రవాదుల దాడిలో మరణించడం చాలా బాధాకరమైన విషయమని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు అన్నారు. నరసన్నపేట మండల కేంద్రంలో స్థానిక సాయి రత్న ఐటిఐ కళాశాల వద్ద అమరులైన జవాన్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను అర్పించిన జవాన్ల కుటుంబాలకు తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నరసన్నపేట నియోజకవర్గ ఏఐవైఎఫ్ నాయకులు వంశీ, జగన్నాథం, భవాని శంకర్, జగదీష్, రాము, సాంబశివరాజు పాల్గొన్నారు.

## 'స్మితా సబర్వాల్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం'

**ఎల్ఎన్‌పేట, జులై 22 (వార్త):** సివిల్స్ సర్వీసెస్‌కు దివ్యాంగుల కోటా ఎందుకంటూ సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ ట్విట్టర్లో ప్రశ్నించటం పట్ల దివ్యాంగ, సక్షం నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో ఉన్న దివ్యాంగ ఉన్నతాధికారులు, ఉన్నత స్థాయి వ్యక్తులు తమ విధులను చక్కగా నిర్వహిస్తున్నారన్నారు. ఈవిషయం ఆమెకు తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణం ఆమె ఈ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సక్ష్యం ప్రతినిధులు ఎం.కె.మిశ్రో, రమా, శైలజా, భాస్కర రావు, గణపతి, పురుషోత్తం, శ్రీను, సాయి, ముకుంద, అప్పలస్వామి, అప్పలనాయుడు, నారాయణరావు, తిరుపతి, రమేష్, ఉషారాణి, జగదీష్, శంకర్, ప్రసాద్, రాంబాబు, వాసవి, రమణమూర్తి, బుజ్జి, చందూ, దేవిక, చిన్నారావు డిమాండ్ చేశారు.

## దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు తగదు

**మందస, జులై22 (వార్త):** దివ్యాంగులకు రిజర్వేషన్ అవసరమా.. అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తెలంగాణ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి కార్యదర్శి, మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మల్లారెడ్డి భాస్కరరావు ఖండించారు. సొండిపూడిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల చట్టం 2016 సెక్షన్92 ప్రకారం భారత ప్రభుత్వం ఆమెపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వ్యాఖ్యలను ఆధారంగా చేసుకొని సుప్రీంకోర్టు సుమోటోగా కేసును స్వీకరించాలని ఆయన డిమాండ్ చేశారు.




## పాతపట్నంలో ఐటీఐని మంజూరు చేయండి



**కొత్తూరు, జులై 22 (వార్త):** రాష్ట్రంలో అత్యంత వెనుకుబాటుకు గురైన పాతపట్నం నియోజకవర్గంలో ఐటీఐని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవితో కలిసి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని మామిడి గోవిందరావు తెలిపారు.

## ప్రమాదకరంగా విద్యుత్ మీటరు

**పోలాకి, జులై 22 (వార్త):** చల్లాయి వలస గ్రామంలో గత రెండు నెలలుగా వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో వీధులు అంధకారంగా మారాయి. పంచాయతీ అధికారుల దృష్టికి గ్రామస్థులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. అలాగే విద్యుత్ మీటరు స్తంభానికి తక్కువ ఎత్తులో ఉంది. దీన్ని చిన్నపిల్లలు పట్టుకుంటే విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ప్రభుత్వ గిడ్డంగుల సంస్థ వద్ద హమాలీల నిరసన



**కొత్తూరు, జులై 22 (వార్త):** కొత్తూరు మండలంలోని వసప గ్రామంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ వద్ద సోమవారం హమాలీలు నిరసనకు దిగారు. కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం ఎప్పటి నుంచో ఇక్కడే పనిచేస్తున్న 120 మంది హమాలీలను తొలగించి కొత్తగా 100 మందిని తీసుకుంటున్నారన్నారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ పనిచేస్తున్న తమను ఎలా తొలగించారన్నారు. దీనివల్ల తాము రోడ్డున పడతామని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని హమాలీలు కోరారు.

# పాఠశాల ఆవరణలో వర్షపు నీరు

* మోకాళ్ల లోతు వరకూ నిలిచిన నీరు * పాఠశాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపని విద్యార్థులు
* నీరు నిల్వ లేకుండా చూడాలని కోరుతున్న తల్లిదండ్రులు



**మెళియాపుట్టి, జులై22(వార్త):** ఇటీవల కురిసిన వర్షాలకు ముక్తాపురం ప్రాథమిక పాఠశాల ఆవరణ నీటితో నిండిపోయింది. మోకాళ్ల లోతులో నీరు ఉండడం వల్ల పాఠశాలకు పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ఈవిషయమై గ్రామస్థులు ఎంఈవో దేవేంద్రరావు దృష్టికి తీసుకువెళ్లారు. పాఠశాలకు ఆనుకుని ఉన్న స్థలంలో భవనాల నిర్మాణం కట్టడం వల్ల వర్షం పడితే పాఠశాల ఆవరణలో నీరు నిలిచిపోతోందని, గ్రామపెద్దలు దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామన్నారు. ముక్తాపురంలో లోతట్టు ఆవరణలో ఉన్న ఈ రహదారి మీదుగానే బడి, గుడి, పంచాయతీ కార్యాలయం, అంగన్వాడి భవనాలకు రాకపోకలు చేయాల్సివుంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.



## తైక్వాండో పోటీల్లో కేజీబీవీ విద్యార్థినుల సత్తా

**జలుమూరు, జులై 22 (వార్త):** 14వ తైక్వాండో జిల్లా స్థాయి పోటీలు శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో ఇటీవల నిర్వహించారు. ఈ పోటీల్లో జలుమూరు కేజీబీవీ విద్యార్థినులు ఏడు బంగారు, ఒక వెండి, రెండు కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారని ప్రిన్సిపాల్ అర్నాగుల యశోద తెలిపారు. బంగారు పతకాలు సాధించిన ఎస్.మనోజ్, ఎన్.హేమ లత, జ్యోతి, ఎనోమలత, జ్ఞానేశ్వరి, శ్రీవల్లి, దీక్షిత అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు పీఈటీ వై.నీరజ, ఎంఈవో బమ్మిడి మాధవరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

## 28 వరకూ శిక్ష సప్తహ్

**కొత్తూరు, జులై 22 (వార్త):** కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జాతీయ విద్యా విధానం-2020 ప్రవేశపెట్టి నాలుగు వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 22 నుంచి 28 వరకూ రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని విద్యాశాఖ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని కొత్తూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు చంద్రకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు సులభ పద్ధతుల్లో ఆసక్తికరంగా బోధించుటకు టియల్‌యమ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ ప్రదర్శన మిగతా వారికి స్ఫూరి దాయకంగా ఉంటుందని చెప్పారు.

## రైలు ఢీ కొని వ్యక్తి మృతి


**సంతబొమ్మాళి, జులై 22 (వార్త):** నౌపడ రైల్వే గేటు ఇజ్జువరం గ్రామ సమీపంలో సోమవారం రైలు ఢీ కొని టెక్కలి గొల్లవీధికి చెందిన కూన పెంటయ్య (53) మృతి చెందాడని రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పలాస తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

## సూర్యనారాయణ కుటుంబానికి కృష్ణదాస్ పరామర్శ



**పోలాకి/జలుమూరు, జులై22 (వార్త):** పోలాకి మండలం కత్తిరివానిపేటలో ఇటీవల మృతిచెందిన వైసీపీ నేత సూర్యనారాయణ కుటుంబాన్ని జిల్లా వైసీపీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ సోమవారం పరామర్శించారు. ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ పరంగా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## సురవరంలో చోరీ



**జలుమూరు, జులై 22 (వార్త):** సురవరం గ్రామంలో శివప్రసాద్ ఇంట్లో చోరీ జరిగింది. శివప్రసాద్ శ్రీకాకుళంలో నివాసముంటుండగా, అతని తల్లి సురవరంలో ఉంటున్నారు. ఆమె ఇటీవల హైదరాబాద్‌లోని చిన్న కుమారుడి ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరువాలోని తొమ్మిది లక్షలు నగదు, వెండి వస్తువులు దోచుకెళ్లారు. అయితే ఆదివారం శివప్రసాద్ సురవరంలోని ఇంట్లోకి రాగా, బీరువా తెరిచివుండడాన్ని గుర్తించి జలుమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## సొంత నిధులతో రోడ్డు నిర్మాణం

### 'గొల్లంగి'ని అభినందించిన రావిపాడు గ్రామస్థులు

**జలుమూరు, జులై 22 (వార్త):** రావివలస పంచాయతీకి చెందిన గొల్లంగి సత్యనారాయణ సొంత నిధులతో రావిపాడు కాలనీ, తిలారు జంక్షన్ సమీపంలో గల రామలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రహదారిని మరమ్మతులు చేయించారు. ఈ రోడ్డుకు పడిన గోతులను సొంత నిధులతో పూడ్చారు. దీంతో సత్యనారాయణను గ్రామస్థులు అభినందించారు.

# రైతులందరికీ బీమా

* వైసీపీ హయాంలో బీమా వ్యవస్థ చిన్నాభిన్నం
* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు




**టెక్కలి, జులై 22 (వార్త):** రాష్ట్ర వ్యాప్తంగా రైతులందరికీ బీమా అమలు చేయాలని, విపత్తు సమయాల్లో రైతులకు న్యాయం జరగాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. పంటల బీమాపై రాష్ట్ర మంత్రులు వ్యవసాయ, ఉద్యాన శాఖ ఉన్నతాధికారులతో సోమవారం మధ్యాహ్నం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సూచించిన విధానాల్లో ఉత్తమ విధానం బీమాకు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.. గత వైసీపీ ప్రభుత్వం బీమా వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని, ప్రీమియం చెల్లింపులు జరగలేదన్నారు. విపత్తు సమయాల్లో రైతులకు న్యాయం జరిగేలా బీమా అమలు కావాలన్నారు. దిగుబడి, వాతావరణ పరిస్థితుల బట్టి బీమా అమలులో ఉన్న అవకాశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మామిడి రైతులకూ బీమా అమలు చేసే అవకాశాలపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. బీమా అమలు, క్లైమ్‌లు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి నివేదికను రాష్ట్ర ముఖ్యమంత్రికి పంపిస్తామన్నారు.

## టెక్కలిలో టీడీపీ ఫ్లెక్సీల చింపివేత

* జగతి మెట్టు జంక్షన్ వద్ద ఘటన
* పోలీసులకు ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు



**టెక్కలి, జులై 22 (వార్త):** పట్టణంలో జగతిమెట్ట వద్ద తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అగంతకులు చింపివేశారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పౌర సన్మానం కోసం శుక్రవారం భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. జగతిమెట్ట వద్ద జాతీయ రహదారికి అనుకొని ఉన్న ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆదివారం రాత్రి చింపివేశారు. వీటిని కొందరు ఉద్దేశపూర్వకంగా చింపివేశారు. దీంతో టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆగ్రహం చేశారు. అనంతరం సీఐ పైడయ్యకు ఫిర్యాదు చేశారు. సీఐ సోమవారం సాయంత్రం ఫ్లెక్సీలు చింపివేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. అయితే ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఈ పని ఎవరు చేశారన్నది బయటకు రాలేదు. ఇది ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారా లేకపోతే వారి వ్యక్తిగత అవసరాల కోసం ఫ్లెక్సీలు చింపివేశారా అన్నదానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని స్థానిక టిడిపి నాయకుడు కోరాడ రాంప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## ఉపాధి క్షేత్ర సహాయకులపై ఫిర్యాదు

**సారవకోట/జలుమూరు, జులై 22 (వార్త):** సారవకోట మండలంలోని గొర్రిబంద, నవతల ఉపాధిహామీ క్షేత్ర సహాయకులపై ఆయా గ్రామాల ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంపీడీవో రాంబాబు దర్యాప్తును ప్రారంభించారు. కాగా, అనుపురం గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు రంగారావు రాజీనామా చేశారని ఎంపీడీవో తెలిపారు.

## వంతెన నిర్మాణానికి కృషి

### బీజేపీ పాతపట్నం నియోజకవర్గ సమన్వయకర్త సలాన

**మెళియాపుట్టి, జులై 22 (వార్త):** గోకర్ణపురంలో వంతెన నిర్మాణం కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతుందని బీజేపీ పాతపట్నం నియోజకవర్గ సమన్వయకర్త సలాన శరత్ కుమార్ అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోకర్ణపురం గ్రామంలోని రాధాసాగరం గెడ్డలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ గెడ్డ నీటి మట్టాన్ని సలాన శరత్ కుమార్ సోమవారం పరిశీలించారు. అనంతరం గ్రామస్థులు, సర్పంచ్ సేనాపతి రవికుమార్‌తో మాట్లాడారు. గెడ్డలోకి అధికంగా నీరు రావడంతో తమ గ్రామానికి ఇతర గ్రామాలతో రాకపోకలు నిలిచి పోతాయన్నారు. ఆ సమయంలో రేషన్ తదితర నిత్యవసర సరుకులకు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. వర్షాకాలంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటామని వాపోయారు. ఇదే విషయమై గత ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు. దీనికి శరత్ కుమార్ స్పందిస్తూ గోకర్ణపురంలో రాధాసాగరం గెడ్డపై వంతెన నిర్మిస్తే ఈ సమస్య పరిష్కారమవుతుందన్నారు. దీన్ని కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పాడి పశువుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**బూర్జ, జులై 22 (వార్త):** సమాజంలో పాడిపశువుల పరిరక్షణ మనందరి బాధ్యతని బూర్జ వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు అన్నారు. సోమవారం ఓవీపేటలో జరిగిన పాడి పశువుల వాక్సినేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాడి పశువులకు లంపిస్కిన్ వ్యాధికి సంబంధించిన వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు మాసాలకు పైబడిన ప్రతీ పాడి పశువునకు ఈ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయాలన్నారు. ఈ వ్యాక్సిన్ ఓ.వి.పేట లైవ్ స్టాక్ యూనిట్లో అందుబాటులో వుందన్నారు. ప్రభుత్వం ఉచితంగా ప్రతి ప్రభుత్వ పశువైద్య కేంద్రంలో ఉచితంగా అందిస్తున్నారన్నారు. పాడి రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

*** కూటమి ప్రభుత్వంలో రాక్షస పాలన * మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం**



**ఆమదాలవలస, జులై22 (వార్త):** రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాక్షస పాలన సాగిస్తుందని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం విమర్శించారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 45 రోజుల్లో రాష్ట్రంలో హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, ఆస్తుల ధ్వంసం జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో 35 హత్యలు, 305 హత్య ప్రయత్నాలు, 20 అత్యాచారాలు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగ పాలన ఆపి శాంతి భద్రతలను నెలకొల్పాలన్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో ఎంపీ మిథున్ రెడ్డి మాజీ ఎంపీ రెడ్డప్ప ఇల్లపై దాడి చేసి వారి వాహనాలు నిప్పు పెట్టి ధ్వంసం చేశారని ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వినుకొండలో మైనార్టీ యువకుడు రషీద్‌ను నడిరోడ్డుపై నరికి చంపి రాక్షస పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా నరమేధం ఆపి శాంతిభద్రతలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఎరువులు పూర్తిస్థాయిలో అందించలేదని వచ్చిన అరకొర ఎరువులు స్థానిక నాయకుల ఇళ్లల్లో వేసుకొని పసుపు కండువా వేసుకున్న వారికే అందిస్తున్నారని విమర్శించారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో ప్రజలకు ఇచ్చిన హామీలను అటకెక్కించినట్టే అని ఆయన విమర్శించారు. ప్రజల మీకు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని ప్రజలకు మేలు చేయాలని రెడ్ బుక్ రాజ్యాంగం అమలు ఇప్పటికైనా ఆపేయాలని సీతారాం ప్రభుత్వానికి హితవు పలికారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్లు దుంపల శ్యామలరావు, ఎ.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

# రహదారికి గండ్లు

*** వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డు**
*** నిలిచిన రాకపోకలు**
*** పట్టించుకోని పాలకులు**





**బూర్జ, జులై 22 (వార్త):** మండలంలోని కొల్లివలస- నారాయణపురం ప్రధాన రహదారి మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పూర్తిగా గతుకులుగా మారింది. గుత్తావల్లి, లాభాం, నారాయణపురం, లంకాం, మామిడివలస తదితర సుమారు పది గ్రామాల ప్రజలు ఈ రహదారి గుండా కొల్లివలసకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. గత పాలకుల నిర్లక్ష్యానికి అయిదేళ్లుగా మరమ్మత్తులకు నోచుకోలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ రహదారి నేడు పూర్తిగా కొట్టుకుపోయింది. కంకర తేలి మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురౌతున్నారు. ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న ఈ రోడ్డు కనీసం ఏళ్ల తరబడి మరమ్మత్తులకైనా నోచుకోవడం లేదు. ప్రస్తుతం ఈ రహదారిలో రాకపోకలు సాగించడానికి వీల్లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం స్పందించి ఈ రోడ్డును మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

## పంట పొలాల పరిశీలన

**ఆమదాలవలస, జులై 22 (వార్త):** ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు సరుబుజ్జిలి మండలంలో నీట మునిగిన పంటలను ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సింగూరు కిరణ్ కుమార్, సీహెచ్ బాలకృష్ణ పరిశీలించారు. విత్తనాలు చల్లిన నుంచి 30 రోజుల మధ్యలో నారుమడి ఐదు రోజులు కన్నా ఎక్కువ నీటిలో మునిగినట్లయితే నారుమడి దెబ్బతినే అవకాశం ఉందని రైతులకు వారు తెలిపారు. వరి ఎద కూడా ఎక్కువ రోజులు ముంపునకు గురైతే కుళ్లిపోయి దెబ్బతింటుందని సూచించారు. వీలున్నంతవరకు బయటకు వెళ్లే విధంగా చూడాలని చెప్పారు. నారు మడులు, ఎదలు దెబ్బతింటే ఎంటియు 10 61, 12 32 లాంటి తేలికపాటి రకాలను విత్తు కోవాలన్నారు. నారుమడి కొద్దిగా బాగున్నట్టయితే ఐదు సెంట్లు విస్తీర్ణంగా నారుమడికి యూరియా, పొటాస్, కిలో చొప్పున వేసుకోవాలని, అలాగే లీటర్ నీటికి ఒక గ్రాము చొప్పున కార్బన్డెజమ్ పిచికారి చేయాలన్నారు. వరి ఎదలో నీటిని బయటికి తీసి ఎకరాకు యూరియా 20కిలోలు, పొటాస్ 20 కిలోలు వేయాలని తద్వారా ఎదలు నీటి ముంపు నుంచి కోలుకునే అవకాశం ఉందని రైతులకు శాస్త్రవేత్తలు సూచించారు.




## అలరించిన ధనవతి గాత్రం

**ఇచ్ఛాపురం, జులై22 (వార్త):** జిల్లాలోని ఊసవానిపేటలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో స్థానిక కళాకారిణి పేదిని ధనవతి గాత్రం అలరించింది. గురుపౌర్ణమి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె బాబా పై గీతాలు ఆలపించారు. కమిటీ సభ్యులు సన్మానించారు.

## రైతు భరోసా ఎప్పుడిస్తారు

**ఇచ్ఛాపురం, జులై 22 (వార్త):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటుతున్న రైతులకు నేటికీ రైతు భరోసా ఇవ్వలేదని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. మండలం, మున్సిపాలిటీలో సుమారు ఆరు వేల మంది రైతులు ఉన్నారన్నారు. వారంతా రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. రైతు భరోసా నగదు ఎప్పుడిస్తారో చెప్పాలన్నారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ అధికారి టి భార్గవిని కలసి సోమవారం వినత పత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, కౌన్సిలర్ బచ్చు జగన్, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, మాజీ జడ్పీటీసీ దక్కత నూకయ్యారెడ్డి, సర్పంచ్ కారింగి త్రినాథ రెడ్డి, సల్ల దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

## 27 వరకూ మున్సిపాలిటీలో ఆధార్ సేవలు

**ఇచ్ఛాపురం, జులై 22 (వార్త):** మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 27 వరకు ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని కమిషనర్ రమేశ్ చెప్పారు. 23న బెల్లుపడ, కార్జీ వీధి సచివాలయం, 24న మంగళవారం పేట, బెల్లు పడ కాలనీ సచివాలయం, 25న తురకవీధి, 26న రత్తకన్న, 27న ఫకీరు పేట సచివాలయం పరిధిలో పిల్లలు ఆధార్, బయోమెట్రిక్, ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కార్యదర్శి విజయ్ కుమార్ పర్యవేక్షణ లో జరుగుతాయని చెప్పారు.



## జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ కార్యాలయం తనిఖీ



**శ్రీకాకుళం క్రైం, జులై 22 (వార్త):** ఎచ్చెర్ల జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ కార్యాలయాన్ని సోమవారం సాయంత్రం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో వివిధ విభాగాల పనితీరు, సిబ్బంది వివరాలు పరిశీలించారు. ఈ క్రమంలో ముందుగా ఏఆర్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం, ఆయుధగారం, మోటర్ ట్రాన్స్పోర్ట్ విభాగం, బాంబ్ డిస్పొసెల్, డాగ్ స్క్వాడ్ గదులు, గ్యాస్ గోడౌన్స్, వ్యాయామశాల తదితర విభాగాలను పరిశీలించి, విభాగాల రికార్డులు నిర్వహణపై ఆరా తీశారు. ఆయుధాలను, వాహనాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. పోలీస్ జాగిలాల ఆరోగ్యంపై శ్రద్ధ చూపించి వాటి రక్షణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఐలు సురేష్, నర్సింగరావు, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## సులభతర బోధనకు టీఎల్ఎం దోహదం

**సంతబొమ్మాళి, జులై 22 (వార్త):** విద్యార్థులకు సులభతర బోధనకు బోధనోపకరణాలు ఎంతో దోహద పడతాయని మండల విద్యాశాఖాధికారి జలుమూరు చిన్నవాడు అన్నారు. సంతబొమ్మాళి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తహ వారం రోజులు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన టిఎల్ఎం మేళాలో ఎంఈవో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు సమక్షంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ అంగూరు రామారావు ఈ మేళాను ప్రారంభించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలలో ఉండే వస్తువులతో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా తయారు చేసే బోధానోపకరణాలు విద్యాబోధనలో ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. లోకాస్ట్ నోకాస్ట్‌తో తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లఖినాన వెంకటరమణ, నరసింహమూర్తి, హరిప్రసాద్, ఆనందరావు, సిమ్మన్న, ఎల్వి రమణ, మయూరి, భవాని, రోజారమణి, రజిని, పావని, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మహిళా స్వయంశక్తి సంఘాలకు రుణాలు అందించాలి

**ఆమదాలవలస, జులై 22 (వార్త):** రూరల్ ఏరియాల్లో మహిళా స్వయంశక్తి సంఘాలు, రైతులతో ఏర్పాటుచేసిన రైతు ఉత్పత్తిదారుల సంఘాలు అన్నింటికీ తప్పనిసరిగా రుణాలు మంజూరు చేయాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎం.సూర్య కిరణ్ కోరారు. సోమవారం మధ్యాహ్నం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం లో ఏర్పాటు చేసిన మండల్ లెవెల్ బ్యాంకర్స్ జాయింట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా స్వయం శక్తి సంఘాలకు వారు దాచుకున్న పొదుపు డబ్బుల నుంచి సభ్యురాలి అవసరం మేరకు అప్పులు ఇచ్చుకోవడానికి ఇంటర్నల్ ల్యాండింగ్‌ను అందరూ బ్యాంకు మేనేజర్లు ప్రోత్సహించాలని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఆమదాలవలస డీసీసీబీ మాత్రమే 70 సంఘాలకు రుణాలు మంజూరు చేయడం, తిరిగి సక్రమంగా రీపేమెంట్ జరగడంతో రెండవసారి లింకేజీకు సిద్ధంగా ఉన్నారన్నారు. అన్ని గ్రామీణ బ్యాంకులు రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఈ విధానాన్ని ప్రోత్సహించాలని సూచించారు. వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏపీఎం కూర్మారావు మాట్లాడుతూ ఉమెన్ లీడ్ ఎంటర్ప్రైజెస్ కోసం సంఘాలలో ఉన్న మంచి లబ్ధిదారులకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేసి ఆ కుటుంబాల ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్ అసిస్టెంట్ ఎల్‌డిఎం ఉమాశంకర్, స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ కిరణ్‌తో పాటు నాలుగు మండలాల ఏపిఎంలు, క్లస్టర్ కోఆర్డినేటర్లు, వ్యవసాయ అధికారులు, మెప్మా సిబ్బంది, నాలుగు మండలాల బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.




Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413